# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శుక్రవారం 24, అక్టోబర్ 2025




కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి రైతులు

# మద్దతు ధర పొందాలి

☆ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, అక్టోబర్ 23, ప్రభాతవార్త**

రైతు సంక్షేమంలో భాగంగా 2025-26 వానాకాలం సంబంధిత వరి ధాన్యం కొరకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరతో రైతుల వద్ద నుండి ధాన్యం సేకరిస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య, జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ లతో కలిసి వరి ధాన్యం కొనుగోలు సంబంధిత గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 2025-26 వానాకాలం సంబంధిత వరి ధాన్యాన్ని రైతుల వద్ద నుండి మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. గ్రేడ్ ఏ రకానికి క్వింటాలుకు 2 వేల 389 రూపాయలు, సాధారణ రకానికి క్వింటాలుకు 2 వేల 369 రూపాయలుగా మద్దతు ధర నిర్ణయించడం జరిగిందని, సన్న రకం వడ్లకు మద్దతు ధరతో పాటు అదనంగా క్వింటాలుకు 500 రూపాయలు చెల్లించడం జరుగుతుందని తెలిపారు. రైతులు నిబంధనలను పాటిస్తూ తేమశాతం, తప్ప, తాలు లేకుండా నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని తెలిపారు. జిల్లాలో 4 ఏజెన్సీల ద్వారా 31 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ పరిధిలో 147, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పరిధిలో 91, మెప్మా పరిధిలో 7, డిసిఎంఎస్ పరిధిలో 56 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి ధాన్యం సేకరించడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా త్రాగునీరు, నీడ ఇతర మౌలిక సదుపాయాలు మిగతా 2లో..



# మెరుగైన విద్యా విధానాలను అమలు చేసేందుకు అంతర్జాతీయ ఎక్స్పోజర్ విజిట్

✤ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

**ఆసిఫాబాద్, అక్టోబర్ 23, ప్రభాతవార్త**

విద్యా విధానాన్ని మరింత మెరుగుపరిచేందుకు అంతర్జాతీయ ఎక్స్పోజర్ విజిట్ నిర్వహించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే తెలిపారు. అంతర్జాతీయ ఎక్స్పోజర్ విజిట్ కొరకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను ఎంపిక చేసేందుకు గురువారం కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్లో జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా ఇన్చార్జి విద్యాధికారి దీపక్ తివారి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రమాదేవి లతో కలిసి ఇంటర్వ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ ఎక్స్పోజర్ విజిట్ తోప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ అనేక కార్యక్రమాలు చేపట్టి విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందన్నారు. దీని కొరకు సెకండరీ గ్రేడ్ టీచర్లు, స్కూల్ అసిస్టెంట్లు, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల నుంచి ముగ్గురు ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసేందుకు ఇంటర్వ్యూ నిర్వహించడం జరిగిందని, ఇందులో ఇద్దరూ సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు, మిగతా 2లో..

# నిందితులను కఠినంగా శిక్షించాలి

❐ ఆసిఫాబాద్ బిజేపి జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం

**ఆసిఫాబాద్, అక్టోబర్ 23, ప్రభాతవార్త**



గోమాతని రక్షించినందుకు గాను అతన్ని కాల్చిన నిందితులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని బిజేపి జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం డిమాండ్ చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ బిజేపి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిజేపి జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ హైదారాబాద్‌లోని ఘట్కేసర్ దగ్గర గోమాతను రక్షించినందుకు గాను సోను సింగ్ (ప్రశాంత్)పై జరిగిన క్రూర దాడిని బిజేపి తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వరుసగా హిందువులపై దాడులు జరుగుతున్నాయని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దీనికి ఖచ్చితంగా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపులో మిగతా 2లో..

# అకాల వర్షం రైతులకు తీవ్రనష్టం

**బజార్‌హత్నూర్, అక్టోబర్ 23, ప్రభాతవార్త**

మండలంలోని పలు గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం ఒక్క సారిగా భారీ వర్షం పడింది. వర్షాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పత్తి పంట చేతుకు వచ్చే సమయంలో వర్షం పడటం వల్ల రైతులు నష్టపోతున్నారు. ముఖ్యంగా మొక్కజొన్న, సోయాబీన్ పంటలు ఆరబెట్టుకోవడానికి రైతులు నానా తంటాలు పడుతున్నారు. రైతులు ఎన్ని మిగతా 2లో..





నిరుద్యోగ యువతకు వరం

# మెగా జాబ్ మేళా

**బెల్లంపల్లి, అక్టోబర్ 23, ప్రభాతవార్త**

సింగరేణి ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీ ఆదివారం రోజున బెల్లంపల్లి పట్టణంలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళాకు సంబంధించిన ప్రచార పోస్టర్ ను బెల్లంపల్లి ఏఎంసి గ్రౌండ్‌లో గురువారం రోజున ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ ఆవిష్కరించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న ప్రజా ప్రభుత్వ మిగతా 2లో..

# ఆకట్టుకున్న గుస్సాడి నృత్యాలు

**కాగజ్‌నగర్ రూరల్, అక్టోబర్ 23, ప్రభాతవార్త**

కాగజ్‌నగర్ మండలం చిన్న మాలినిలో దీపావళి పండుగను పురస్కరించుకుని ఆదివాసీ గుడేలలో దండారీ ఉత్సవాలు ఘనంగా జరిగాయి ఆదివాసీ మహిళలు. పురుషులు సంప్రదాయ దుస్తులు ధరించి ప్రత్యేక పూజలు నిర్వహించి దండారీ నృత్యాలు చేశారు. దండారీ ఉత్సవాల్లో చేసిన గుస్సాడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. మారుమూల గ్రామమైన చిన్నమాలినిలో జరుగుతున్న దండారీ ఉత్సవాల్లో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు ఉత్సవాల్లో పాల్గొన్నట్లు బీఆర్ఎస్ నాయకులు బండి వాసు, పోచం,లలిత, వెంకటేష్‌లు వెల్లి దండారీ ఉత్సవాల్లో పాల్గొన్నారు.



# విద్యారంగ బలోపేతం దిశగా ప్రభుత్వం కృషి

◆ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

జైపూర్, అక్టోబర్ 23, ప్రభాతవార్త

ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేస్తూ విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన వద్యను అందిస్తూ విద్యారంగ బలోపేతం దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం భీమారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి తరగతి గదులు, వంటశాల, మధ్యాహ్న భోజనం నాణ్యత, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలలలో త్రాగునీరు, విద్యుత్, మూత్ర శాలలు, ప్రహరీ గోడ ఇతర మౌలిక సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తుందని తెలిపారు. ఈ క్రమంలో విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులను నియమించి గుణాత్మక విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, ఈ నేపథ్యంలో విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత విద్యను అభ్యసించాలని తెలిపారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయడంతో పాటు తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పాఠశాలలో చేపట్టిన అదనపు గదుల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వార్డులు, మందుల నిల్వలు, ల్యాబ్, పరిసరాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. వైద్యులు సిబ్బంది విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని, ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజలకు వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఆసుపత్రిలోని వార్డులు, పరిసరాలలో



పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించడంతోపాటు నాణ్యమైన విద్యా బోధన చేయాలని తెలిపారు. పాఠశాలలో చేపట్టిన మరమ్మత్తు పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం మండలంలోని దాంపూర్ గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. నిరుపేదల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో లబ్ధిదారులు నిర్దేశిత విస్తీర్ణంలో ఇల్లు నిర్మించుకునే విధంగా అధికారులు అవగాహన కల్పించాలని తెలిపారు. నిబంధనల ప్రకారం ఇల్లు నిర్మించుకున్నట్లయితే సకాలంలో నిర్మాణ దశల వారీగా బిల్లులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి మధుసూదన్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఆరే క్షత్రియ కుల ధృవీకరణ పత్రం మంజూరు చేయాలి

ఆసిఫాబాద్, అక్టోబర్ 23, ప్రభాతవార్త

జిల్లాలోని ఆరె కులస్థులకు ఆరె క్షత్రియ కుల ధృవీకరణ పత్రం మంజూరు చేయాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. జిల్లా ఆరే సంక్షేమ సంఘం నాయకులతో కలిసి గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రేకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ గతంలో ఆరే కులస్తులకు ఆరే క్షత్రియ కుల ధృవీకరణ పత్రాలు మంజూరు చేసేవారని, కొన్ని రోజులుగా మంజూరు చేయడం లేదని, దీనితో విద్య, ఉద్యోగా అవకాశాల్లో తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన ధృవీకరణ పత్రాలు మంజూరు చేసేలా కృషి చేయాలని కలెక్టర్ ను కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు చన్కపూర్ శంకర్, ఉప అధ్యక్షులు బొట్టుపల్లి మోహన్, ఏలూములే కిషోర్, దవులత్, ఏలూములే శంకర్, జాబోర్ మరుతి, చౌదరి నానాజీ, కాళిదాస్, చన్కపూర్ లావణ్య, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు పరిహారం చెక్కు అందజేత

మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, అక్టోబర్ 23, ప్రభాతవార్త

జిల్లాలోని మంచిర్యాల పట్టణ పరిధిలో గల జాఫర్ నగర్‌లో విద్యుత్ ప్రమాదంలో ఇంటిని కోల్పోయిన బాధితులకు పరిహారం చెక్కు అందజేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో విద్యుత్ ప్రమాదంలో ఇంటిని కోల్పోయిన బాధితులు చిట్టోజు శరణ్యకు 36 వేల రూపాయల పరిహారం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మంచిర్యాల పట్టణంలోని జాఫర్ నగర్ ప్రాంతానికి చెందిన చిట్టోజు శరణ్య విద్యుత్ ప్రమాదంలో తన ఇంటిని కోల్పోయినందున, రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి సిఫారసు మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధి క్రింద బాధితులకు 36 వేల రూపాయల చెక్కును అందజేయడం జరిగిందని తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో తక్షణ ఆర్థిక సహాయం క్రింద 7 వేల రూపాయలు అందించడం జరిగిందని తెలిపారు ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## మెరుగైన విద్యా విధానాలను అమలు చేసేందుకు అంతర్జాతీయ ఎక్స్‌పోజర్ విజిట్

(మొదటిపేజీ తరువాయి)

ఇద్దరు ప్రధానోపాధ్యాయులు, ముగ్గురు స్కూల్ అసిస్టెంట్లు హాజరయ్యారని తెలిపారు. ఉపాధ్యాయులను వారి పాఠశాలల వారీగా విద్యార్థుల సంఖ్య పెంపొందించేందుకు, డ్రాప్ అవుట్లను తగ్గించేందుకు, విద్యార్థులలో కనీస అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు అమలు చేస్తున్న విధివిధానాలపై ఇంటర్వ్యూ నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఎంపికైన ఉపాధ్యాయులను జపాన్, సింగపూర్, ఫిన్లాండ్, వియత్నాం దేశాలకు పంపించడం జరుగుతుందని, ఆయా దేశాలలో అమలవుతున్న విద్య విధానాలు, కార్యక్రమాలను పరిశీలించి జిల్లాలో విద్యాభివృద్ధికి సహకరించడంపై అధ్యయనం చేయవలసి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అకాల వర్షం రైతులకు తీవ్రనష్టం

(మొదటిపేజీ తరువాయి)

ప్రయత్నాలు చేసిన విత్తు నాటిన నుండి, మొక్కలు పెరిగిన తరువాత మూగ జీవుల నుండి, కాపాడుకుంటూ వస్తుంటారు. కానీ రైతుల ఆశలు మాత్రం అడియాశలు అవుతున్నాయి.

## నిందితులను కఠినంగా శిక్షించాలి

(మొదటిపేజీ తరువాయి)

లేవని, సంబంధిత హోంశాఖను సిఎం దగ్గర పెట్టుకొని చోద్యం చూస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా నిందితులను పట్టుకోవాలని, లేని యెడల రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఎస్టీ మోర్చ రాష్ట్ర కార్యదర్శి కొట్నక విజయ్, బిజెపి యూత్ జిల్లా అధ్యక్షులు గాజుల ప్రసాద్, చేర్ల మురళీ, రెబ్బెన మండల అధ్యక్షులు రాంబాబు, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు మాటురి జయరాజ్, వాంకిడి మండల అధ్యక్షులు నరేష్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు సుజిత్ తదితరులు పాల్గొన్నారు.

### కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి రైతులు

## మద్దతు ధర పొందాలి

(మొదటిపేజీ తరువాయి)

కల్పించడంతో పాటు గన్నీ సంచులు, టార్పాలిన్ కవర్లు, ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు, ప్యాడి క్లీనర్లు ఇతర సౌకర్యాలు సమకూర్చడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో దాదాపు 2 లక్షల 32 వేల మెట్రిక్ టన్నుల అంచనా ధాన్యం రావడం జరుగుతుందని, నవంబర్ మొదటి వారంలో వరి ధాన్యం కోతలు మొదలవుతాయని తెలిపారు. ఇందుకు అనుగుణంగా జిల్లాలోని అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అవసరమైన ఏర్పాట్లతో ధాన్యం సేకరణకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో వరి ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయిలో ప్రతిభ కనబరిచిన జైపూర్ గురుకుల విద్యార్థి

జైపూర్,అక్టోబర్ 23, ప్రభాతవార్త

అక్టోబర్ 10 నుంచి 12 వరకు కర్ణాటకలో 38వ మెన్స్ నేషనల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో మండల కేంద్రం లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలకు చెందిన ఇంటర్ విద్యార్థి కొత్తపల్లి సాత్విక్ పాల్గొని జాతీయస్థాయిలో అత్యంత ప్రతిభ కనపరిచాడని గురువారం ప్రిన్సిపాల్ కోల నాగేశ్వర రావు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించి జాతీయస్థాయిలో అత్యంత ప్రతిభ కనపరచడం చాలా గర్వించదగ్గ విషయమని వ్యాయామ ఉపాధ్యాయులు గాంధార్ల సంతోష్, రత్నం శ్రీనివాస్‌లు అన్నారు. సీనియర్ వైస్ ప్రిన్సిపల్ స్రవంతి, జూనియర్ వైస్ ప్రిన్సిపల్ మహిపాల్, హౌస్ మాస్టర్ మహేష్, ఉపాధ్యాయ బృందం సాత్విక్‌ను అభినందించారు.




# నిరుద్యోగ యువతకు వరం మెగా జాబ్ మేళా

(మొదటిపేజీ తరువాయి)

నిర్ణయానికి అనుగుణంగా బెల్లంపల్లిలో సుమారు 80 కి పైగా ప్రైవేటు కంపెనీల వారితో మెగా జాబ్ మేళాను ఆదివారం నిర్వహిస్తున్నామని, దీనిని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ అన్నారు. జాబ్ మేళాలో పాల్గొనదలిచిన నిరుద్యోగ యువత పోస్టర్‌లో ఉన్న క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేసి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ మెగా జాబ్ మేళా ద్వారా నిరుద్యోగులు తమకు గల విద్యార్హతలకు సంబంధించిన ఉద్యోగాలను ఎంచుకునే అవకాశం కల్పిస్తున్నామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జి.ఎం విజయ ప్రసాద్, బెల్లంపల్లి ఏఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్, సిఎంఓఏఐ అధ్యక్షులు రమేష్, సివిల్ ఎస్.ఈ రాము, జి.ఎం.వి.టి.సి మేనేజర్ శంకర్, ఏఐటియుసి సీనియర్ నాయకులు చిప్ప నరసయ్య, ఏఐటియుసి మందమరి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, గోగర్ల శోభన్ బాబు నోబెల్ ఎంపవర్మెంట్ స్టేట్ మేనేజర్, సీనియర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 25న మినీ జాబ్ మేళా

**నస్పూర్, అక్టోబర్ 23, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని టాస్క్ ట్రైనింగ్ సెంటర్‌లో ఈ నెల 25వ తేదీ ఉదయం 10.30 గంటలకు మినీ జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. జెవిజి మేనేజ్మెంట్ కన్సల్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాదు సంస్థలో హైదరాబాద్ ప్రాంతంలో పని చేసేందుకు 100 టెక్నీషియన్స్ (ఫ్రెషర్స్) పోస్టుల భర్తీకి ఐటిఐ (ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, టర్నర్, మిషనిస్ట్, వెల్డర్) అర్హత కలిగి 1822 వయసు కలిగిన పురుషులు/మహిళ అభ్యర్థులు, 100 ట్రైనీ టెక్నీషియన్స్ (ఫ్రెషర్స్) భర్తీకి ఎస్. ఎస్. సి./ఇంటర్/ ఏదేని డిగ్రీ అర్హత కలిగి 18-23 వయసు అర్హత కలిగిన పురుషులు/మహిళ అభ్యర్థులకు అవకాశం కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఇతర వివరాలకు 9010584000, 8333059029, 9963452486 నెంబర్లలో సంప్రదించవచ్చని, ఆసక్తి అర్హత కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



## అండర్ 19 క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు

**బెల్లంపల్లి, అక్టోబర్ 23, ప్రభాతవార్త**

మంచిర్యాల మరియు ఆసిఫాబాద్ జిల్లాల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎస్‌జిఎఫ్ అండర్ 19 క్రికెట్ పోటీలు మురళి మెమోరియల్ క్రికెట్ అకాడమీ బెల్లంపల్లిలో ఎస్‌జిఎఫ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి బాబురావు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా మాజీ బెల్లంపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రామచందర్, టిపిసిసి రాష్ట్ర ప్రచార కమిటి కన్వీనర్ నాతరి స్వామి అదేవిధంగా టిజిఎస్‌డబ్ల్యూ ఆర్‌జెసి బాయ్స్ కాజీపేట ప్రిన్సిపాల్ ఊటూరి సంతోష్, కెరియర్ గ్రూప్ ఫౌండేషన్ చైర్మన్ గుర్రపు రాజేశం పాల్గొన్నారు. ఈ పోటీలకు 100 మంది పైచిలుకు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాతరి స్వామి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు ఆటలు మానసిక ధైర్యాన్ని కలిపిస్తాయని తెలిపారు. అదేవిధంగా ఈ సెలక్షన్‌లో ఎంపికైన విద్యార్థులు రాష్ట్రస్థాయి జాతీయస్థాయిలో పాల్గొనాలని విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమాన్ని మురళి మెమోరియల్ క్రికెట్ అకాడమీ ప్రెసిడెంట్ అల్లం వెంకటేష్, వైస్ ప్రెసిడెంట్ ఎం. రాజేష్, కోచ్ జాడి శేఖర్ గౌతమ్, వ్యాయామ ఉపాధ్యాయులు సుదీప్, ప్రతాప్, శ్రీనివాస్, వామన్, హరీష్ తదితరులు పాల్గొన్నారు. ఈ పోటీలలో 30 మంది విద్యార్థులను క్యాంపు కొరకు ఎంపిక చేయడం జరిగింది. ఎంపికైన విద్యార్థులకు డీఐఈఓ అంజయ్య శుభాకాంక్షలు తెలిపారు .

## భూముల వివరాలు పక్కాగా నమోదు చేయాలి

### - ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

**ఆసిఫాబాద్, అక్టోబర్ 23, ప్రభాతవార్త**

అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా సేకరించిన భూముల వివరాలను పక్కాగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశం మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావులతో కలిసి తహసిల్దార్లతో వివిధ అభివృద్ధి పనుల కొరకు సేకరించిన భూముల వివరాల నమోదుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం వివిధ అభివృద్ధి పనుల కొరకు సేకరించిన భూములు, చెరువులు, ప్రాజెక్టులు, కాలువలు, రహదారులు, రైల్వేలైన్ నిర్మాణ పనులలో సేకరించిన భూములు, ప్రభుత్వ భూములు, సీలింగ్, లావుని పట్టా, దేవాదాయ, వక్ఫ్ భూముల వివరాలను 22 ఎ నిషేధిత జాబితాలో నమోదు చేయాలని తెలిపారు. ఏ ఒక్క సర్వే నెంబరు తప్పొద్దని, గ్రామాల వారీగా నిషేధిత జాబితాలలో ఉన్న భూముల వివరాలను పరిశీలించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# పోలీసుల త్యాగాలు, సేవలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయి

### సిసిసి నస్పూర్ ఎస్సై యు. ఉపేందర్ రావు - సిసిసి నస్పూర్ పోలీస్ స్టేషన్‌లో ఓపెన్‌హౌస్ కార్యక్రమం

**నస్పూర్, అక్టోబర్ 23, ప్రభాతవార్త**

శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా అమరులైన పోలీసుల త్యాగాలు, సేవలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని సిసిసి నస్పూర్ ఎస్సై యు. ఉపేందర్ రావు అన్నారు. గురువారం పోలీసు అమరవీరుల సంస్మరణ (పోలీస్ ఫ్లాగ్ డే) వారోత్సవాలను పురస్కరించుకొని సిసిసి నస్పూర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఓపెన్‌హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిసిసి నస్పూర్ ఎస్సై యు. ఉపేందర్ రావు మాట్లాడుతూ, చట్టాన్ని గౌరవించడం, ట్రాఫిక్ నియమాలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఓపెన్‌హౌస్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆక్స్‌ఫోర్డ్ పాఠశాల విద్యార్థులకు ప్రస్తుతం సమాజంలో కీలకంగా మారిన పలు అంశాలపై పోలీసులు సమగ్ర అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, సైబర్ నేరాల తీరు, మోసగాళ్ల వలలో పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అలాగే ఫిర్యాదు చేసేందుకు ఉన్న 1930 నంబరు గురించి, మాదకద్రవ్యాల వాడకం వల్ల కలిగే అనర్థాలు, భయంకరమైన పరిణామాలపై హెచ్చరించి, వాటికి దూరంగా ఉండాలని సూచించారు. బాలికల రక్షణ కోసం ఏర్పాటు చేసిన భరోసా కేంద్రం సేవలు, షీ టీమ్ పనితీరు గురించి వివరించారు. పోలీసు విధులు, ప్రజల రక్షణలో పోలీసుల సేవలు, యాంటీ నార్కోటిక్ డ్రగ్స్ వంటి విభాగాల బాధ్యతలను క్లుప్తంగా తెలిపారు. ఓపెన్ హౌస్‌లో భాగంగా, విద్యార్థులకు పోలీసు వ్యవస్థ పనితీరును ప్రత్యక్షంగా పరిచయం చేశారు. స్టేషన్‌లో పనిచేసే సిబ్బంది విధులు, బాధితులు ఫిర్యాదు ఇచ్చే విధానం, దానిపై విచారణ జరిగే పద్ధతి




వివరించారు. పోలీసులు వినియోగించే సాంకేతిక పరికరాలైన సీసీ కెమెరాల ప్రాధాన్యం, ఫింగర్ ప్రింట్ డివైస్, ట్రాఫిక్ ఎక్విప్‌మెంట్, డయల్ 100 విధానం గురించి క్లుప్తంగా వివరించి, కాల్ చేసిన వెంటనే పోలీసులు ఎలా స్పందిస్తారో తెలిపారు. అనంతరం, ఆయుధాల వినియోగాన్ని ప్రదర్శించి, విద్యార్థుల ప్రశ్నలకు అధికారులు సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ బషీర్, పోలీస్ సిబ్బంది, ఆక్స్‌ఫోర్డ్ పాఠశాల అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.




## పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్

**లక్షెట్టిపేట, అక్టోబర్ 23, ప్రభాతవార్త**

పోలీస్ సంస్కరణ వారోత్సవాల సందర్భంగా లక్షెట్టిపేట పోలీస్ స్టేషన్‌లో ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లక్షెట్టిపేట ఆర్కె పాఠశాల చెందిన విద్యార్థులతో పాటు, పలు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పోలీసుల పనితీరు పై ఎస్సై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ అనిల్‌తో పాటు పోలీస్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.



## తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుకు చర్యలు

### - ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

**ఆసిఫాబాద్, అక్టోబర్ 23, ప్రభాతవార్త**

జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయం ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. గురువారం కలెక్టరేట్ భవన సముదాయం ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్టాపన కొరకు అనువైన స్థలాన్ని జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, రోడ్లు భవనాల శాఖ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్ భవన సముదాయం ఆవరణలో అనువైన ప్రదేశంలో తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో భాగంగా స్థలాన్ని పరిశీలించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పాముకాటుతో ఆశ కార్యకర్త మృతి

**బెజ్జూర్, ప్రభాతవార్త**



బెజ్జూర్ మండలంలోని ఇప్పలగూడెం గ్రామానికి చెందిన ఆశా కార్యకర్త కనాక కమల (47) గురువారం పాముకాటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలి కొడుకు కనాక సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పంచనామా నిర్వహించినట్లు ఎస్ఐ సర్తాజ్ పాషా తెలిపారు. ఉదయం కాలకృత్యాల కోసం ఇంటి పెరడులోకి వెళ్ళగా పాము కాటు వేసిందని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకెల్తున్న క్రమంలో మార్గమధ్యలో మృతి చెందినట్లు వారు పేర్కొన్నారు.

## తుడుందెబ్బ భారీ బహిరంగ సభను విజయవంతం చేయండి

**ఆసిఫాబాద్, అక్టోబర్ 23, ప్రభాతవార్త**



ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు డిసెంబర్ 9న కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షులు కోట్నక విజయ్, జాతీయ నాయకులు బుర్స పోచయ్య పేర్కొన్నారు. గురువారం ఆసిఫాబాద్ పట్టణంలో స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు నిర్వహించే భారీ బహిరంగ సభలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆదివాసీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ భారీ బహిరంగ సభలో 1/70, పీసా చట్టం అమలు, జీవో ఎంఎస్ నెంబర్లు 149, 3 తో పాటు పలు సమస్యలపై చర్చించనునట్లు తెలిపారు.

## జిల్లాస్థాయి ఎస్‌జిఎఫ్ కుస్తీ పోటీలకు గురుకుల విద్యార్థుల ఎంపిక

**లక్షెట్టిపేట, అక్టోబర్ 23, ప్రభాతవార్త**

జిల్లా స్థాయి కుస్తీ పోటీలకు విద్యార్థులు ఎంపికైనట్లు గురుకుల కళాశాల ప్రిన్సిపల్ కె. రమ కళ్యాణి తెలిపారు. తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ గురుకుల లక్షటపేట స్కూల్ గేమ్స్ అద్వర్యంలో అండర్ 14, 17 బాలికల జిల్లాస్థాయి రెజ్లింగ్ ఎంపిక పోటీలు ఘనంగా జరిగాయి. జిల్లాలోని వివిధ పాఠశాల బాలికలు అధిక సంఖ్యలో పోల్గొన్నారని. అంబర్ 14, ఆండర్ 17 విభాగాలలో ప్రతిభ కనభర్చిన బాలికలను జోనల్ స్థాయికి ఎంపిక చేయబడినట్లు తెలిపారు. పిఈటి రమదేవి, ఆర్గనైజింగ్ సెక్రెటరి దోజిసెల రాజేష్, సాంబామూర్తి, తిరుపతి, మమత, తదితరులు పాల్గొన్నారు.





## ఆదివాసీ ఆత్మగౌరవానికి ప్రతీక కొమరం భీమ్

పెంచికల్ పేట్, అక్టోబర్ 23, ప్రభాతవార్త

ఆదివాసీ గిరిజన హక్కుల ఉద్యమ వీరుడు కొమరం భీమ్ 125 వ జయంతి ఉత్సవాల సందర్భంగా గురువారం పెంచికల్ పేట్ మండల కేంద్రంలో గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా భీమ్ జయంతి వేడుకలు నిర్వహించారు. భీమ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గోండ్వాన ఆదివాసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిడెం అశోక్ మాట్లాడుతు ఆదివాసీలు ఐక్యంగా ఉండి సమస్యలపై కలిసికట్టుగా పోరాడాలని అన్నారు. ఆదివాసీ హక్కుల రక్షణ కోసం భవిష్యత్ ప్రణాళిక సిద్ధం చేసి కొమరం భీమ్ ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమములో మండల కోయ సంక్షేమ సంఘం అధ్యక్షులు సకారం, గౌరవం అధ్యక్షులు తలండి మధుకర్, రాయి సెంటర్ సర్మేడి భుజంగ రావు ఆదివాసీ నాయకులు పుల్లయ్య, భాస్కర్, మధునయ్య తదితరులు పాల్గొన్నారు.



## సమాజ భద్రతలో పోలీసుల పాత్రపై విద్యార్థులకు అవగహన

పెంచికల్ పేట్, అక్టోబర్ 23, ప్రభాతవార్త :

మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్ లో పోలీస్ అమరవీరుల వారోత్సవాలలో భాగంగా గురువారం ఎస్సై అనిల్ కుమార్ ఆధ్వర్యంలో కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థులకు సమాజంలో పోలీసుల పాత్రపై స్టేషన్ లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై అనిల్ కుమార్ విద్యార్థులకు ఆయుధాల వినియోగం, స్టేషన్ రికార్డులు, ఎఫ్ఐఆర్ లు, విచారణ విధానాలను విద్యార్థులకు చూపించి వివరించారు. అనంతరం అయన మాట్లాడుతు విద్యార్థులు చట్టానికి గౌరవం ఇవ్వాలి చట్ట పరిజ్ఞానం పెంపోదడం వలన సమాజంలో నేరాలు తగ్గుతాయని విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమములో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి డిఎల్పిఓ హారిశ్చంద్ర

పెంచికల్ పేట్, అక్టోబర్ 23, ప్రభాతవార్త :

పెంచికల్ పేట్ మండలంలోని గిరిజన గ్రామాలైన కమ్మార్గం, మురళీగూడ,జిల్లేడ, అగర్ గూడ, గ్రామాలలో గురువారం డిఎల్పిఓ హారిశ్చంద్ర పర్యటించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించారు లబ్ధిదారులతో సమావేశం అయ్యి త్వరితగతిన ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకుని బిల్లులు పొందాలని అన్నారు. కమ్మార్గం, జిల్లేడ పాఠశాలలను సందర్శించి కిచెన్ షెడ్ల నిర్మాణాన్ని, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యవంతమైన ఆహారం అందించాలని మధ్యాహ్న భోజన సిబ్బందికి తెలిపారు. ఈ పర్యటనలో అయన వెంట ఎంపిడిఓ ఆల్బర్ట్, హౌసింగ్ ఏఈ సందీప్ కార్యదర్శులు పాల్గొన్నారు.



# ఉత్సాహంగా పరిసరాల శుభ్రత కోసం సింగరేణి ఉద్యోగులు

**- జనరల్ మేనేజర్ విజయ భాస్కర్ రెడ్డి**

బెల్లంపల్లి, అక్టోబర్ 23, ప్రభాతవార్త

బొగ్గు ఉత్పత్తి, కార్యాలయాల్లో విధులే కాకుంగా సమాజ శ్రేయస్సు, పరిసరాల శుభ్రత కోసం బెల్లంపల్లి ఏరియా సింగరేణి ఉద్యోగులు ఉత్సాహంగా ముందుకు వస్తున్నారని జనరల్ మేనేజర్ ఎం. విజయ భాస్కర్ రెడ్డి అన్నారు. స్పెషల్ క్యాంపెయిన్ 5.0 కార్యక్రమంలో భాగంగా గురువారం రోజున గోలేటి లోని శ్రీ సత్య సాయి బాబా ఆలయం, జిటిసిఓఎ క్లబ్ పరిసరాల్లో స్వచ్ఛత కోసం శ్రమదానం చేశారు. గంటన్నర పాటు జనరల్ మేనేజర్ విజయ భాస్కర్ రెడ్డి ఏరియా అధికారులు, జనరల్ మేనేజర్ కార్యాలయ ఉద్యోగులతో కలిసి చెత్త, గడ్డి మొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. గాలి వానకు విరిగిపోయి ప్రమాదకరంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించారు. స్వచ్ఛత కోసం సింగరేణి ఉద్యోగులు పడుతున్న శ్రమను, సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్న తీరును జిఎం ప్రశంసించారు. మరే ఇతర రంగాల్లో ఇలాంటి సేవా కార్యక్రమాలు కానరావని అయన అన్నారు. ఈనెల 31 వ తేదీ వరకు మాత్రమే కాకుండా నిత్యం స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రతి పౌరుడు నిత్య పరిసరాల శుభ్రత కోసం ఓ గంట కేటాయిస్తే కాలనీలు, గ్రామాలే కాదు దేశమంతా స్వచ్ఛత పరిడవిల్లుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి బ్రాంచి కార్యదర్శి ఎస్. తిరుపతి, ఏరియా అధికారుల సంఘం నాయకుడు ఉజ్వల్ కుమార్ బెహరా, ఎస్ఓ టు జిఎం కె. రాజమల్లు, డీజీఎం (సివిల్) ఎస్కే మదీనా బాషా, ఇంచార్జి ఎన్విరాన్మెంట్ అధికారి హరీష్, వర్క్ షాప్ హెచ్ఓడి జి. జ్ఞానేశ్వర్, ఏరియా సెక్యూరిటి అధికారి శ్రీధర్, ఫైనాన్స్ మేనేజర్ రవికుమార్, ఎస్టేట్ అధికారి సాగర్, ఐటి మేనేజర్ ముజీబ్, పర్సనల్ డిపార్ట్ మెంట్ హెచ్ఓడి శ్రీనివాస్, సర్వే అధికారి స్వామి, సినియర్ సివిల్ ఈఈ రాజేంద్రప్రసాద్, అకౌంట్స్ అధికారి వెంకటేశ్వర్లు, జూనియర్ ఫారెస్ట్ అధికారిణి సుష్మ తదితరులు పాల్గొన్నారు.





## ఈనెల 25న శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ శిఖర ప్రతిష్టాపన

దిలావర్పూర్, అక్టోబర్ 23, ప్రభాతవార్త

నిర్మల్ జిల్లా దిలావర్పూర్ మండల కేంద్రంలోని అతి పురాతనమైన రేణుక ఎల్లమ్మ దేవాలయంలో పంచలోహ శ్రీ రేణుక ఎల్లమ్మ సహిత కాలభైరవ విగ్రహ, ఆలయ శిఖర ప్రతిష్టాపన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు గ్రామ అభివృద్ధి కమిటీ గురువారం తెలిపారు. ఈనెల 25 తేదీ నుండి 26వ తేదీ వరకు ఇట్టి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఉదయం 8 గంటల నుండి మంగళ వాయిద్య వేదసూక్త వచనములతో గణపతి పూజ కార్యక్రమంతో ప్రారంభించి రెండు రోజులపాటు పూజలు, హోమాలు పలు రకాల పూజలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. చివరి రోజున అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని తెలిపారు.

## గిరిజన సహకార సంస్థ సొసైటీ మేనేజర్గా సందీప్ కుమార్ అదనపు బాధ్యతలు

ఆసిఫాబాద్, అక్టోబర్ 23, ప్రభాతవార్త



గిరిజన సహకార సంస్థ (జీసీసీ) సొసైటీ మేనేజర్గా ఉట్నూరు డివిజన్ మేనేజర్ గుడిమళ్ల సందీప్ కుమార్ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గురువారం కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిజన సహకార సంస్థ సొసైటీ కార్యాలయంలో మేనేజర్గా బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న మేనేజర్ తారాచంద్ అనారోగ్య కారణాలతో సెలవులో వెళ్ళటంతో సందీప్ కుమార్కు అదనపు బాధ్యతలు అందజేశారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది సదాశివం, గోవిందరావు, చందు, సంతోష్, ప్రియాంక మేనేజర్కు శుభాకాంక్షలు తెలిపారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

మామడ, అక్టోబర్ 23, ప్రభాతవార్త

మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ హమ్మద్ పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో చేపట్టిన ఇళ్ల నిర్మాణం, మంజూరు ఆయన నిదులు, పనుల పురోగతి తెలుసుకున్నారు. ఇందులో హౌసింగ్ పిడి రాజేశ్వర్, డిఇఇ గంగాధర్, మండల ప్రత్యేక అధికారి రాజనర్సయ్య, ఎంపిడిఓ శుశిల్ రెడ్డి, ఎంపిఓ ఉపేందర్, ఏఈ హరీష్ ఉన్నారు.



## ఆలయ ఇంఛార్జి అధికారిగా భూమయ్య

సారంగాపూర్, అక్టోబర్ 23, ప్రభాతవార్త

మండలంలోని అడెల్లి పోచమ్మ దేవస్థానం ఈవోగా పనిచేసిన రమేష్ బదిలీపై ఆదిలాబాద్ వెళ్లగా. దీనితో ఆలయ అధికారి పదవి ఖాళీ ఉండడంతో ఇంచార్జ్ ఈవోగా భూమయ్యను నియమించారు. ఈయనగురువారం రోజు పదవి బాధ్యతలు స్వీకారించేను. భూమయ్య ఇంత క్రితం ఆలయ సీనియర్ అసిస్టెంట్గా పనిచేసి ప్రమోషన్ పై అదిలాబాదులోని గోపాల మఠం ఈవోగా కొంత కాలం భాద్యతలు నిర్వహించడం జరిగింది. అక్కడ నుండి తానురు మండలలోని ఏల్వత్ ఈవోగా వెళ్లి బాధ్యతలు కొనసాగిస్తున్నారు. ఇతనికి ప్రస్తుతం కాల్వ, కదిలి,దేవరకోట, గండి రామన్న,దేవాలయఆలయకు అదనపు భాద్యతలతో కొనసాగిస్తున్న సమయంలో మళ్ళీ అదనంగా అడెల్లి పోచమ్మ దేవాలయాలకి ఇంచార్జి ఈవోగా బాధ్యతలు అప్పగించడం జరిగింది. ఇతనిని పలువురు అభినందించారు.





# విద్యార్థులకు నాణ్యమైన విద్య

## - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**నస్పూర్, అక్టోబర్ 23, ప్రభాతవార్త**

ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలలో విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు తీసుకోవాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో ఆశ్రమ పాఠశాలలు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల ప్రత్యేక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా సంస్థలను బలోపేతం చేస్తూ ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన త్రాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, ప్రహరీ గోడ ఇతర సదుపాయాలు కల్పించడంతో పాటు విద్యార్థుల ఆరోగ్య దృష్ట్యా మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు, వసతి, మూత్రశాలలు సరిపడా ఉండాలని, ఫ్లోరింగ్, రూఫ్, ఫర్నిచర్‌తో కూడిన భోజనశాలల ఏర్పాటు కొరకు ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని తెలిపారు. ప్రత్యేక అధికారులు తమ పరిధిలోని పాఠశాలలను నిత్యం సందర్శిస్తూ ఆయా పాఠశాలలలో నెలకొన్న సమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం విద్యార్థులకు సకాలంలో పౌష్టిక ఆహారం అందించేందుకు అవసరమైన ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. పాఠశాలలలో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన నిర్మాణ పనులకు సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన తెలంగాణ రైసింగ్ విజన్ 2047 సిటిజన్ సర్వేలో ప్రతి ఒక్కరు పాల్గొనేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఔట్‌డోర్ ఫుట్‌బాల్ ఈవెంట్ ప్రారంభించిన మందమర్రి జిఎం



**మందమర్రి, అక్టోబర్ 23, ప్రభాతవార్త**

వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 61 వ వార్షిక క్రీడాల్లో భాగంగా ఔట్ డోర్ ఫుట్బాల్ ఈవెంట్ స్థానిక సింగరేణి మైదానంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణ, పర్సనల్ మేనేజర్ శ్యామ్ సుందర్, ఎస్ ఈ రాము, మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, సెంట్రల్ కమిటీ మెంబర్ సివి రమణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం ఆదేశాల మేరకు సింగరేణి ఉద్యోగులకు ప్రతి ఏటా క్రీడలను నిర్వహించడం జరుగుతుందని, ఈ పోటీలలో పాల్గొన్న క్రీడాకారులు కళాకారులు కోల్ ఇండియా స్థాయిలో ప్రతి సంవత్సరం ఎన్నో బహుమతులు సాధించి సింగరేణికి పేరు ప్రఖ్యాతలు తీసుకు వస్తున్నారని, సీనియర్ క్రీడాకారులు సంస్థలు పనిచేస్తున్న యువ ఉద్యోగులను క్రీడల వైపు ప్రోత్సహించాలని అన్నారు. ఈ క్రీడలు మానసిక ఉల్లాసానికే కాక శరీర దృఢత్వానికి తోడ్పడతాయని వారన్నారు. ఉద్యోగి ఆరోగ్యంగా ఉన్నప్పుడే సంస్థ అభివృద్ధికి దోహదం చేసిన వారు అవుతారని అన్నారు. ఈ రోజు జరిగిన ఈవెంట్‌లో కాసిపేట్ 1 గ్రూప్ విన్నర్‌గా, కేకే గ్రూప్ రన్నెర్స్‌గా నిలిచారు. ఈ కార్యక్రమంలో ఎం.కార్తీక్ సీనియర్ పిఓ, జియం ఆఫీస్ క్రీడల గౌరవ కార్యదర్శి, డబ్ల్యు పిఎస్ అండ్ జిఏ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ శివకృష్ణ, శాఖ శ్రీను జనరల్ కెప్టెన్ మరియు క్రీడాకారులు పాల్గొన్నారు.

# పేకాట స్థావరం పై దాడి

## పలువురు అరెస్ట్



**జైపూర్, అక్టోబర్ 23, ప్రభాతవార్త**

టేకుమట్ల గ్రామ శివారులో పేకాట స్థావరం పై పోలీసులు దాడి చేసి పేకాట ఆడుతున్న పలువురిని పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి పోలీసులు వివరాలు వెల్లడించారు. టేకుమట్ల, ఇందారం, భీమారం మండలానికి చెందిన కొంత మంది పేకాట ఆడుతున్నారని సమాచారం మేరకు శ్రీరాంపూర్ సీఐ వేణు చందర్, ఎస్.ఐ శ్రీధర్ పోలీస్ సిబ్బంది మల్లికార్జున్, రమేష్, శివ సదవలితో కలిసి పేకాట ఆడుతున్న 13 మంది వ్యక్తులను పట్టుకోవడానికి ప్రయత్నించగా ముగ్గురు పారిపోగా, పది మందిని పట్టుకొనన్నట్లు తెలిపారు. వారి వద్ద 1,77,240 రూపాయలను, నాలుగు ద్విచక్రవాహనాలను, ఎనిమిది సెల్ ఫోన్‌లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. పోలీసులకు పట్టుబడ్డ వారి వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి. టేకుమాట్ల గ్రామానికి చెందిన గోషిక జ్ఞానేందర్, కాటం బానేష్, కొత్తపల్లి విజయ్, ఇందారం గ్రామానికి చెందిన కామెర మురళి, పులి మహేష్, బేధ శ్రీనివాస్, బేధ రాము, బేధ మల్లేష్,మేకల స్వామి, భీమారం మండలం మడిక్కల్ గ్రామానికి చెందిన చింతం సుమంత్, పారిపోయిన వారి వివరాలు వెంగళ సతీష్, అక్బర్, బబ్లు పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



# ప్రభుత్వ బడి వేదిక నిర్మాణానికి రెహమాన్ ఫౌండేషన్ ఆర్థిక సహాయం

**లింగాపూర్, అక్టోబర్ 23, ప్రభాతవార్త**

మండలంలోని ఎల్లాపటార్ గ్రామ ప్రభుత్వ పాఠశాల ముందు, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, జాతీయ పండుగలు నిర్వహించేందుకు అవసరమైన వేదిక నిర్మాణానికి రెహమాన్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ షేక్ అబ్దుల్ రెహమాన్ జిలాని మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి రూ. 10,000 ఆర్థిక సహాయం అందించారు. ఈ సాయంతో పాఠశాల పరిసరాల్లో విద్యార్థుల ప్రతిభను వెలికితీయడానికి అవసరమైన వేదిక (స్టేజ్) నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా డాక్టర్ షేక్ అబ్దుల్ రెహమాన్ జిలాని మాట్లాడుతూ, విద్యా సంస్థల అభివృద్ధి అంటే భవిష్యత్తు అభివృద్ధి. విద్యార్థుల ప్రతిభ వెలుగులు విరజిమ్మాలంటే సదుపాయాలు మెరుగుపడాలి. ప్రతి గ్రామ పాఠశాల అభివృద్ధి చెందితేనే సమాజం ముందుకు సాగుతుంది అని పేర్కొన్నారు. పాఠశాల సిబ్బంది చైర్మన్ మర్యాదపూర్వకంగా శాలువాతో సన్మానించారు. పాఠశాల ఉపాధ్యాయులు రాథోడ్ వినోద్, ఆడే ఉత్తమ్, ఆడే గోపాల్, నవీన్, దయాకర్ తదితరులు పాల్గొని, చైర్మన్ సేవాభావాన్ని ప్రశంసించారు. గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆయనకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# కళాజాతతో యువతకు అవగాహన సదస్సు

**కెరమెరి, అక్టోబర్ 23, ప్రభాతవార్త**

మండలంలోని ఖైదీ గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో కళాజాత బృందంతో యువతకు అవగాహన సదస్సు నిర్వహించారు  కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఐపీఎస్  ఆదేశాల మేరకు, ఆసిఫాబాద్ ఏఎస్పి చిత్తరరంజన్ ఐపీఎస్  ఆధ్వర్యంలో కేరమేరి మండలంలోని ఖైరి గ్రామంలో పోలీస్ కళా జాత బృందం ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ మధుకర్  ముఖ్య అతిథిగా పాల్గొనిఈ సందర్భంగా మాట్లాడారు  మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే హానికర ప్రభావాలు, బాల్య వివాహాల అపాయం, సైబర్ క్రైమ్స్ నివారణ, మహిళల రక్షణ, ట్రాఫిక్ నిబంధనలు మరియు ఇతర సామాజిక సమస్యలపై గ్రామస్తులకు స్పష్టమైన అవగాహన కల్పించారు. ఎవరైనా మాదకద్రవ్యాలు వినియోగించిన సరఫరా చేసిన  వెంటనే డయాల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. పోలీస్ కళా జాత బృందం పాటల ద్వారా ప్రజల్లో చైతన్యం కలిగించే విధంగా ప్రదర్శనలు నిర్వహించింది. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, యువత, విద్యార్థులు భారీగా పాల్గొన్నారు

# స్వయం సహాయక సంఘాల ఋణాలతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తి చేయాలి

## - ఎంపిడీఓ సత్య నారాయణ



**జైపూర్, ప్రభాతవార్త**

గురువారం మండల అభివృద్ధి అధికారి గుర్రాల సత్య నారాయణ, పంచాయతీ అధికారి శ్రీపతి బాపు రావులు యాప్ ఇన్స్పెక్షన్‌లో భాగంగా శెటుపెల్లి, బెజ్జాల గ్రామ పంచాయతీలని సందర్శి, రికార్డులను తనిఖీ చేసి, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణలను పారిశుధ్య పనులు, సెగ్రిగేషన్ షెడ్, స్మశానవాటికలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యి, ఆర్థికంగా వెనక బడిన వారు స్వయం సహాయక సంఘాల ద్వారా ఋణాలు తీసుకొని ఇంటి నిర్మాణ పనులు ప్రారంభి, పూర్తి చేసుకోవాలని సూచించారు. వాటర్ ట్యాంక్‌లను క్రమం తప్పకుండా శుభ్రపరచాలని, రెగ్యులర్‌గా క్లోరినేషన్ చేయాలని, రికార్డులను ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీలో 100 శాతం ఇంటి పన్ను వసూలు చేయాలని సూచించారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు విధిగా ఇంటి పన్ను చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ప్రతిభ, రమాదేవి పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# జీపీలను సందర్శించిన మండల అధికారులు

**దిలావర్పూర్, అక్టోబర్ 23, ప్రభాతవార్త**



దిలావర్పూర్ మండలంలోని సాంగ్వి, బన్నపల్లి, కాల్వ గ్రామాలను ఎంపీడీవో అరుణ, ఎంపీఓ గోవర్ధన్ గురువారం సందర్శించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో వారు అన్ని రికార్డులను పరిశీలించారు. పంచాయతీ వివరాలు అన్ని లెక్కలు పక్కాగా నమోదు చేయాలని వారు సూచించారు. అనంతరం సేగ్రిగేషన్ షెడ్‌లో తయారవుతున్న సేంద్రియ ఎరువులను పరిశీలించారు. రైతులు ఈ ఎరువులు కొనుగోలు చేసి తమ పంట పొలాలలో చల్లుకోవాలని తెలిపారు అంతేకాకుండా కూరగాయలు పండిస్తున్న రైతులు కూడా ఈ ఎరువులు తీసుకువెళ్లాలని పేర్కొన్నారు. గ్రామాలలో కొనసాగుతున్న శానిటైజేషన్ పనులను పర్యవేక్షించారు. ప్రకృతి వనాలలో పెరుగుతున్న పిచ్చి మొక్కలు పెరిగిన చెట్ల కొమ్మలను తొలగించి అందంగా ముస్తాబు చేయాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేసి త్వరితగతిన ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులకు నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అనంతరం అంగన్వాడి కేంద్రాలలో విద్యార్థులకు శుభ్రమైన రుచికరమైన ఆహారం అందించాలని తెలిపారు ప్రతి ఒక్కరికి పోషక ఆహార పదార్థాలు తీసుకునేలా వివరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, లబ్ధిదారులు తదితరులు ఉన్నారు.